క్లుప్తంగా

ఫీవర్ సర్వే సమర్థంగా చేపట్టాలి

డీఎంహెచ్‌ఓ డాక్టర్ నరసింహ నాయక్



చదలవాడలో సర్వే వివరాలు తెలుసుకుంటున్న డీఎంహెచ్‌ఓ

పెద్దాపురం: వైద్యారోగ్య యంత్రాంగం ఫీవర్ సర్వేను సమర్థంగా చేపట్టాలని వైద్య, ఆరోగ్య శాఖాధికారులను డీఎంహెచ్‌ఓ డాక్టర్ నరసింహ నాయక్ ఆదేశించారు. మండలంలోని చదలాడ, తిరుపతి గ్రామాలలో ఆయన ఆదివారం పర్యటించారు. డోర్ టు డోర్ ఫీవర్ సర్వే ఏ విధంగా జరుగుతుందో అడిగి తెలుసుకున్నారు. ఫీవర్ సర్వే విషయంలో అశ్రద్ధ వహిస్తే సహించేది లేదని అధికారులను హెచ్చరించారు. అలాగే వైద్య శిబిరాలను నిర్వహించాలని, బృందాలుగా సర్వేను చేపట్టాలన్నారు. జ్వరంతో బాధపడే అనుమానితులను సమీపంలో ఆసుపత్రికి తరలించి, మెరుగైన వైద్యం అందించాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ సీహెచ్ వెంకటలక్ష్మి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సరిత తదితరులు ఉన్నారు.

ఈ-క్రాప్ నమోదు చేయించాలి

పిఠాపురం: పంటలు సాగు చేస్తున్న రైతులందరూ తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని గొల్లప్రోలు మండల వ్యవసాయాధికారి సత్యనారాయణ ఆదివారం ఇక్కడ తెలిపారు. వచ్చే నెల 15వ తేదీ వరకు గడువు ఉన్నందున రైతులందరూ తమ పొలాలను, పంటలను సంబంధిత రైతు భరోసా కేంద్రాల వద్దకు వెళ్లి ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. రైతులు ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ బుక్, సీసీఆర్సీ కార్డు తీసుకుని వెళ్లి ఆర్బీకేల వద్ద ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే వ్యవసాయ శాఖ సిబ్బంది ఆయా గ్రామాల పరిధిలో ఈ-క్రాప్ నమోదుపై రైతులకు సమాచారం ఇచ్చి, అందరినీ సిద్ధం చేస్తున్నారని తెలిపారు.

దివ్యాంగులకు పండ్ల పంపిణీ



దివ్యాంగుల మధ్య కేక్ కట్ చేస్తున్న సత్యేంద్రకుమార్ స్నేహితులు

సామర్లకోట: రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు పోటీల్లో మూడు పర్యాయాలు ప్రథమ బహుమతులు సాధించిన వల్లూరి సత్యేంద్రకుమార్ జ్ఞాపకార్థం ఆయన స్నేహితుల బృందం దివ్యాంగులకు ఆదివారం పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. సత్యేంద్రకుమార్ మూడేళ్ల క్రితం మృతి చెందడంతో ఆయన జయంతిని పురస్కరించుకుని పులిమేరు గ్రామంలో ఉన్న శాంతివర్ధన్ విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలో డైరెక్టర్ వీరబాబు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. 60 మంది దివ్యాంగ విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్నేహితులు మాట్లాడుతూ సత్యేంద్రకుమార్ ఎడ్ల పరుగులో రాష్ట్ర స్థాయిలో మంచి గుర్తింపు పొందారని కొనియాడారు.

ఒకటిన ఘంటసాల విభావరి

సామర్లకోట: కళలను ప్రోత్సహించాలన్న సంకల్పంతో స్థానిక స్టేషన్ సెంటర్‌లో ఉన్న నూకాలమ్మ ఆలయంలో సెప్టెంబర్ ఒకటిన ఆదివారం సాయంత్రం ఘంటసాల సినీ సంగీత విభావరి కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఘంటసాల అభిమాన సంఘ నాయకుడు చిపాడ నాగేశ్వరరావు తెలిపారు. అంతరించుకుపోతున్న కళలను, కళాకారులను ప్రోత్సహించే కార్యక్రమంలో భాగంగా భీమవరం కళాకారులతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేసిన్నట్టు చెప్పారు.

ఉచిత మెగా కంటి వైద్య శిబిరం



శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పెద్దాపురం: మండలంలోని తాటిపర్తి గ్రామంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరంలో సుమారు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్టు గ్రామ యూత్ నాయకులు కొమ్మిరెడ్డి బుజ్జి తెలిపారు. ఆదివారం గుమ్ములూరి లక్ష్మీనారాయణ తనయులు గుమ్ములూరి శ్రీనివాసరావు, సత్యనారాయణ ఆధ్వర్యంలో మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించిన కొమ్మిరెడ్డి బుజ్జి మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించేందుకు దాతలు ముందుకు రావాలన్నారు. కాకినాడ కిరణ్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం సుమారు 200 మందికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి, కళ్లజోళ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామిశెట్టి శ్రీను, ఎగ్గాడ సత్తిబాబు, ద్వారంపూడి చెల్లారావు, కొమ్మిరెడ్డి నాగ సుబ్రహ్మణ్యం, పేపకాయల తిరుపతిరావు, గోపు చంటిబాబు, కొమ్మిరెడ్డి చంటిబాబు, బండి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాత్రి వేళ పోలీసు భద్రత కల్పించాలి



వైద్యులు, సిబ్బంది అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ వైద్యశాలలో రాత్రి వేళలో ఎక్కువ కష్టంగా ఉంటోంది. ప్రతి ఆస్పత్రి వద్ద పోలీసు బందోబస్తు కల్పించాలి. దీనికితోడు సీసీ కెమేరాలు ఏర్పాటు చేయాలి. ఆస్పత్రుల్లో 50 శాతం మంది మహిళలే పని చేస్తున్నారు. వీరు రాత్రి సమయాల్లో కూడా విధులు నిర్వహించాల్సి ఉంటుంది. మహిళా సిబ్బందికి రక్షణ లేకపోతే విధులు నిర్వహించడం కష్టంగా మారుతుంది. నేరం చేసిన వారికి శిక్ష కఠినంగా ఉండాలి.

– డాక్టర్ సుష్మ, వైద్యాధికారి, కొత్తపల్లి



పోలీస్ అవుట్‌పోస్ట్ ఏర్పాటు చేయాలి



కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై జరిగిన హత్యాచార సంఘటనతో స్థానికంగా పని చేసే డాక్టర్లు, సిబ్బందిలోను భయం పెరిగింది. రాత్రి సమయంలో విధులు నిర్వహించడానికి ఆందోళన చెందుతున్నారు. సీహెచ్‌సీలో అన్ని సదుపాయాలున్నాయి. సీసీ కెమేరాలు ఏర్పాటు చేశారు. ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బంది ఉన్నారు. 24 గంటల పోలీసు అవుట్ పోస్టు ఏర్పాటు చేస్తే మహిళా సిబ్బందిలో ధైర్యం పెరుగుతుంది. ఆస్పత్రి ఆధునీకరణతో డాక్టర్లు, సిబ్బంది సంఖ్య పెరిగడంతో పాటు, మౌలిక సదుపాయాలు పెరిగాయి. దాంతో నిత్యం ఓపీ పెరిగింది. జనరేటర్ సదుపాయం ఉండటంతో విద్యుత్ కోతలున్నా ఎటువంటి ఇబ్బంది లేదు. మహిళలు, డాక్టర్లపై దాడులు చేస్తున్న వారిని కఠినంగా శిక్షించాలి. అప్పుడే ఎవరూ మహిళలతో అసభ్యంగా ప్రవర్తించడానికి అవకాశం ఉండదు. ఇటువంటి కేసుల్లో పోలీసులు, కోర్టులు వేగంగా స్పందించాలి.

– డాక్టర్ అమల, సూపరింటెండెంట్, సీహెచ్‌సీ, సామర్లకోట

రీ.. ఓపెన్

- విద్యకు దూరమైన వారికి వరంగా ఓపెన్ స్కూళ్లు
- టెన్త్, ఇంటర్ రెగ్యులర్ కోర్సులతో సమానం
- పదోన్నతులకూ అవకాశమిస్తున్న వ్యవస్థ
- దివంగత సీఎం వైఎస్సార్ చొరవతో నాలుగు పాఠశాలల ఏర్పాటు

సామర్లకోట: చదువుకోవాలనే ఆసక్తి ఉన్నా, మధ్యలో నిలిపివేసిన వారికి ఓపెన్ స్కూల్ వరంలా మారింది. చదువు అసంపూర్తిగా విడిచిపెట్టిన వారి పరిస్థితిని గమనించిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 2008లో ఓపెన్ స్కూల్‌ను రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించారు. 14 ఏళ్ల నిండి. చదువుకు దూరమైన వారు ఓపెన్ స్కూల్‌లో పదో తరగతిలో చేరే అవకాశం కల్పించారు. ఓపెన్ స్కూల్‌లో చేరడానికి తప్పనిసరిగా పుట్టిన తేదీ కచ్చితంగా ఉండాలి.

డిక్లరేషన్ తప్పనిసరి

ఎటువంటి చదువు లేనివారు.. తాను రాయగలను, చదవగలననే డిక్లరేషన్ ఇవ్వాల్సి ఉంటుంది. ఓపెన్ స్కూల్‌లో పూర్తి చేసిన పదో తరగతి సర్టిఫికెట్ రెగ్యులర్ విద్యార్థుల కోర్సుతో సమానంగా ఉంటుంది. ఈ మేరకు విద్యార్థులు ఇంటర్మీడియెట్‌లో చేరే అవకాశం కూడా ఉంది. ఈ మేరకు పెద్దాపురం నియోజకవర్గంలో సామర్లకోట బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్, ప్రభుత్వ హైస్కూల్, పెద్దాపురం మండలం దివిలి, కొండపల్లి జెడ్పీ హైస్కూల్‌లోను ఓపెన్ స్కూళ్లు నిర్వహిస్తున్నారు.

ఉచితంగా స్టడీ మెటీరియల్

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ఓపెన్ స్కూల్ విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ అందజేస్తారు. దీనిలో బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో ఓపెన్ స్కూల్ విజయవంతంగా కొనసాగుతోంది. ఓపెన్ స్కూల్ విజయవంతం కావడంతో, ఓపెన్ స్కూల్‌లో ఇంటర్మీడియెట్ కోర్సును కూడా ప్రవేశపెట్టారు. 2011లో బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో ఓపెన్ ఇంటర్ ప్రారంభించారు. ఈ మేరకు ఇంటర్‌లో చేరే విద్యార్థులు తప్పనిసరిగా పదో తరగతి ఉత్తీర్ణులు కావాల్సి ఉంటుంది.

పదోన్నతుల కోసం..

వివిధ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో పని చేస్తున్న వారికి పదో తరగతి విద్యార్హత లేక పదోన్నతులు పొందలేకపోతున్నారు. అటువంటి వారు ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతి పూర్తి చేస్తే పదోన్నతులు పొందే అవకాశం ఉంది. దాంతో ఆయా సంస్థల్లో పని చేస్తున్న వారు ఓపెన్ స్కూల్‌లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. ప్రతి ఆదివారంతో పాటు, రెండో శనివారం, పాఠశాలల సెలవు దినాల్లో ఓపెన్ స్కూల్ నిర్వహిస్తున్నారు. పదో తరగతి తర్వాత ఏడాది గడిచాక ఇంటర్ రెండేళ్ల పరీక్షలు ఒకేసారి రాసే అవకాశం ఉంది.



సామర్లకోట బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్



ఓపెన్ స్కూల్ క్లాసులకు హాజరైన విద్యార్థులు (ఫైల్)

పదోన్నతి పొందా



మున్సిపల్ కార్యాలయంలో ఎనిమిదో తరగతి విద్యార్హతతో అటెండర్‌గా చేరాను. సీనియార్టీ ఉన్నా కనీసం పదో తరగతి విద్యార్హత లేకపోవడంతో, చాలా కాలం పదోన్నతి లభించ లేదు. దాంతో స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో ఓపెన్ స్కూల్‌లో పదో తరగతి, ఇంటర్ పూర్తి చేశాను. దాంతో మున్సిపల్ కార్యాలయంలో బిల్లు కలెక్టరుగా పదోన్నతి లభించింది. మాలాంటి వారికి ఓపెన్ స్కూల్ ఓ వరంగా మారింది.

– గిడుతూరి శ్రీనివాసరావు, మున్సిపల్ ఉద్యోగి, సామర్లకోట

నెలాఖరు వరకు అవకాశం



ఓపెన్ స్కూల్‌లో చేరడానికి ఆగస్టు 27లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. 28వ తేదీలోగా రూ.100 అడ్మిషన్ ఫీజు చెల్లించాలి. ప్రవేశ రుసుం జనరల్ అభ్యర్థులకు రూ.1,300, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రూ.900 చెల్లించాలి. రూ.200 అపరాధ రుసుంతో సెప్టెంబరు 4 వరకు అవకాశం ఉంది. ఇప్పటి వరకు ఓపెన్ స్కూల్ పదో తరగతిలో 982 మంది, ఇంటర్‌లో 526 మంది చదువుకున్నారు. విద్య పూర్తి చేసిన అనేక మంది పదోన్నతులు పొందారు.

– తోటకూర సాయిరామకృష్ణ, కో–ఆర్డినేటర్, బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ ఓపెన్ స్కూల్, సామర్లకోట

మాతృ భాషను కాపాడుకోవాలి



తెలుగు ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ప్రముఖులు

పెద్దాపురం: మాతృ భాషను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షుడు జ్యోస్యుల కృష్ణబాబు అన్నారు. ఆదివారం సాహితీ, సాంస్కృతిక రంగాల వేదిక (కాకినాడ) ఆధ్వర్యంలో స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో తెలుగు భాషా దినోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా దాడి చంద్రశేఖరరావు అధ్యక్షతన జరిగిన సభలో కృష్ణబాబు మాట్లాడుతూ, ఎవరైనా ఎన్ని భాషలైనా నేర్చుకోవచ్చని, కానీ మాతృభాషను మరువరాదన్నారు. పలువురు తెలుగు పండితులు మాట్లాడుతూ మాతృభాషలోనే ప్రాథమిక విద్యా బోధన జరిగేలా అందరూ కృషి చేయాలన్నారు. మాతృభాషను విస్మరిస్తే, మాట్లాడడం, రాయడం మానివేస్తే జ్ఞాన సంపద భవిష్యత్తు తరాలకు అందకుండా పోతుందన్నారు. సభాధ్యక్షుడు దాడి చంద్రశేఖరరావు మాట్లాడుతూ ప్రాచీన కవుల సాహిత్యం నుంచి, నేటి ఆధునిక కవుల సాహిత్య గొప్పతనాన్ని వివరించారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన, క్విజ్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం 20 మంది తెలుగు ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.

అసంపూర్తి అభివృద్ధి పనుల పూర్తి

ఎమ్మెల్యే చినరాజప్ప

సామర్లకోట: నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేయడానికి ప్రాధాన్యమిస్తామని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. స్థానిక స్టేషన్ సెంటర్‌లో అసంపూర్తిగా ఉన్న గడియా స్తంభాన్ని ఆదివారం ఆయన మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్యతో కలిసి పరిశీలించారు. గడియార స్తంభం అభివృద్ధికి కుడా నిధులు మంజూరయ్యాయన్నారు. పనులు వేగంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అలాగే అసంపూర్తిగా ఉన్న నీలమ్మ చెరువు పనులను పూర్తి చేస్తామని తెలిపారు. ఈ మేరకు చెరువును పరిశీలించారు. ఆయన వెంట మున్సిపల్ ఇన్‌చార్జి ఏఈ సాగర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ యార్లగడ్డ చిన్ని, కౌన్సిలర్ బలుసు వాసు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ అడబాల కుమారస్వామి తదితరులు ఉన్నారు.

ఆర్థిక ప్రగతి సాధించాలి

మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలని ఎమ్మెల్యే చినరాజప్ప అన్నారు. ఆదివారం మండల మహిళా సమాఖ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ నెల మండల మహిళా సమాఖ్యకు బ్యాంకు నుంచి అందిన మొత్తాన్ని సమాఖ్య ప్రతినిధులకు అందజేశారు. ఏపీఎం డి.ప్రశాంతి, సమాఖ్య అధ్యక్షురాలు ఎం.నాంచారమ్మ తదితరులు పాల్గొన్నారు.



సామర్లకోటలో గడియార స్తంభం అభివృద్ధిపై కమిషనర్ శ్రీవిద్యకు వివరిస్తున్న ఎమ్మెల్యే రాజప్ప

మహిళా సంఘాల అభివృద్ధికి కృషి

పెద్దాపురం: మహిళా సంఘాల అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే చినరాజప్ప అన్నారు. పెద్దాపురం మండల వెలుగు కార్యాలయంలో ఆదివారం లక్‌పతి దీదీ కార్యక్రమంలో భాగంగా డ్వాక్రా సంఘాలకు చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఏపీఎం సూర్యనారాయణ అధ్యక్షత వహించారు. సుమారు రూ.85 లక్షల డ్వాక్రా చెక్కును మహిళా సమాఖ్యలకు ఎమ్మెల్యే అందజేశారు. మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు, ఏఓ సంజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బ్యాడ్మింటన్ పోటీలు

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): యంగ్ మెన్స్ క్రిస్టియన్ అసోసియేషన్(వైఎంసీఏ) ఆధ్వర్యంలో సోమవారం కాకినాడ లేడీస్ రిక్రియేషన్ క్లబ్ ఆవరణలోని ద్రోణాచార్య బ్యాడ్మింటన్ అకాడమీలో దివంగత ఆర్ఎంసీ పీడీ డాక్టర్ కె.స్వర్ణరాజు స్మారక బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నట్టు వైఎంసీఏ కాకినాడ జిల్లా శాఖ అధ్యక్షుడు హెన్రీ, కార్యదర్శి గాంధీ ఆదివారం తెలిపారు. జూనియర్ల విభాగంలో 6 నుంచి 10 తరగతుల విద్యార్థులకు బాలురు, బాలికల్లో సింగిల్, డబుల్స్, సీనియర్స్ విభాగంలో ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు బాలురు, బాలికల సింగిల్, డబుల్స్‌లో పోటీలు ఉంటాయని వివరించారు. ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి ఉదయం 8.30కు పోటీలు ప్రారంభిస్తారని చెప్పారు. పోటీలకు సంబంధించి కోచ్ మూర్తి ఆధ్వర్యంలో ఆదివారం డ్రా తీసినట్టు తెలిపారు. విజేతలకు సెప్టెంబర్ ఏడున జరిగే స్వర్ణరాజు మొదటి స్మారక సభలో బహుమతీ ప్రదానం జరుగుతుందన్నారు.

గ్రీవెన్స్ రద్దు

కాకినాడ సిటీ: కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం రద్దు చేసినట్టు కమిషనర్ భావన తెలిపారు. ఈ నెల 26వ తేదీ సోమవారం శ్రీకృష్ణాష్టమి సందర్భంగా ప్రభుత్వ సెలవు దినం కావడంతో, కార్యక్రమం రద్దు చేసినట్టు చెప్పారు.

రేపు కృష్ణాష్టమి వేడుకలు



సామర్లకోట వేణుగోపాలస్వామి ఆలయంలో రాధాకృష్ణులు

సామర్లకోట: పెద్దాపురం రోడ్డులోని విఘ్నేశ్వర థియేటర్ ఎదురుగా ఉన్న రాధా సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో మంగళవారం కృష్ణాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ నాయకుడు నమ్మి శ్రీనివాసు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ప్రత్యేక పూజలు, అర్చనలు జరుగుతాయన్నారు. అనంతరం దేవతల వేషధారణలతో, బాజాభజంత్రీలు, బాణసంచా కాల్పులు, నృత్యాలతో ఊరేగింపు పట్టణ వీధుల మీదుగా సాగుతుందని చెప్పారు. భక్తులు స్వామివారిని, అమ్మవార్లను దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

కళాకారులకు కోలాటం దుస్తుల అందజేత



కళాకారులకు కోలాటం దుస్తులు అందజేస్తున్న నాయకులు

సామర్లకోట: మండలంలోని హుస్సేన్‌పురం గ్రామానికి చెందిన కళాకారులకు గ్రామ నాయకులు కోలాటం దుస్తులు అందజేశారు. సుమారు ఆరు నెలల పాటు కోలాటం శిక్షణ పూర్తి చేసుకుని, ఆదివారం గ్రామంలోని అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో ప్రదర్శన ఇచ్చారు. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు, చిన్నారులను కోలాట గురువు గుణ్ణం వీర్రాజు అభినందించారు. కోలాటం పూర్తి చేసుకున్న సందర్భంగా చిన్నారుల తల్లులు సామూహిక కుంకుమ పూజలు చేశారు. హిందూ సంస్కృతీ సంప్రదాయాలను పిల్లలకు అలవాటు చేయాలని కోలాట గురువు సూచించారు. వీహెచ్‌పీ నాయకులు అమల కంటి చంటిబాబు, మోదమూను ప్రసాద్, చల్లా బుజ్జి, చల్లా వెంకటరమణ, కోట అప్పారావు, పలివెల చంద్రశేఖర్, ఆలయ అర్చకులు కట్టా రాంబాబు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మికత అవసరం



భక్తి రత్నమాల గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న మల్లికార్జున స్వామి తదితరులు

పెద్దాపురం: సమాజంలోని ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మికత ఎంతో అవసరమని భగవద్గీత ప్రచార సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లికార్జున స్వామి అన్నారు. స్థానిక సత్తిరెడ్డిపేట భగవద్గీతాలయం వద్ద ఆదివారం మానవులను తరింపచేసే భక్తిరత్నమాల ఆధ్యాత్మిక గ్రంథాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మల్లికార్జున స్వామి మాట్లాడుతూ ప్రతిఒక్కరిలో భక్తిభావం పెంపొందాలని ఆకాంక్షించారు. ఇందుకు భక్తి రత్నమాల గ్రంథం ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షులు నేతి వీరభద్రరావు, గౌరవాధ్యక్షుడు గోలి రామచంద్రచౌదరి, కార్యదర్శి సత్యకుమార్, తాటికొండ వెంకటేశ్వరరావు, ఒబిలిశెట్టి వెకంటేశ్వరరావు, నాగభూషణం, మహిళా సభ్యులు అబింక, శ్రీదేవి, కన్వీనర్ కృష్ణ దేవ మనోహర్ తదితరలు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



నవరలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ తేజ

సామర్లకోట: మండలంలోని నవర గ్రామంలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి అపూర్వ స్పందన లభించింది. కాకినాడకు చెందిన భవశ్రీ ఆర్థోపెడిక్, ఈఎన్‌టీ క్లినిక్ ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ చల్లా భావతేజ ఎముకలు, కీళ్లు, నరాలు, వెన్నెముకకు సంబంధించి పరీక్షలు చేశారు. డాక్టర్ ఆకుల స్వాతి చెవి, ముక్కు, గొంతు పరీక్షలు చేశారు. వెంకటేశ్వర కమిటీ ఆధ్వర్యంలో రోగులకు సేవలందించారు. మొత్తం 328 మంది పరీక్షలు చేయించుకున్నారని కమిటీ నాయకులు అగ్గిరాముడు, కంతం శ్రీను తెలిపారు.

అంతా మా ఇష్టం..

- నగర నడిబొడ్డున వేళాపాళా లేని లోడింగ్, అన్ లోడింగ్ కార్యకలాపాలు
- ట్రాఫిక్ నిబంధనలకు నీళ్లు
- నిత్యం ట్రాఫిక్ జాంతో ప్రజల ఇబ్బందులు
- అధికార యంత్రాంగానికి పట్టని నగరవాసుల దుస్థితి

బోట్‌క్లబ్: పట్టణం స్థాయి నుంచి కాకినాడ కార్పొరేషన్ హోదాను పొంది ఏళ్లు గడుస్తున్నాయి. ఇదే స్థాయిలో కాకినాడలో ట్రాఫిక్ గణనీయంగా పెరిగింది. దీంతో ప్రజలు ఇబ్బందులు అంతా ఇంతా కాదు. సాధారణంగా నగరంలో ఉదయం 8 నుంచి రాత్రి 10 గంటల వరకూ ఎటువంటి భారీ వాహనాలకు ప్రవేశం లేదు. వాటిపై పోలీసుల ఆంక్షలు కఠినంగా ఉన్నాయి. భారీ వాహనాలు నగరంలోనికి రాకుండా అటు అచ్చంపేట జంక్షన్, జగన్నాథపురం, ఇంద్రపాలెంలో పోలీసులు గస్తీ సైతం నిర్వహిస్తున్నారు. ఇవేమీ తమకు పట్టవన్నట్టు కొందరు వేళాపాళా లేకుండా నిబంధనలకు తిలోదకాలు ఇస్తున్నారు. పట్టపగలే నగరంలోకి ప్రవేశించిన భారీ వాహనాలతో లోడింగ్, అన్ లోడింగ్ చేస్తున్నారు. వారి వ్యాపారాలు బాగానే సాగుతున్నా, అటుగా వెళ్లే ప్రయాణికులకు మాత్రం తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. కొందరు వ్యాపారులైతే ప్రజలెలా ఉంటే తమకేం అన్నట్టు వ్యవహరిస్తున్నారు. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం తేడా లేకుండా, వారి షాపుల వద్ద భారీ వాహనాలను రోడ్డుకు అడ్డంగా నిలిపి, వ్యాపార లావాదేవీలు సాగిస్తున్నారు. అటుగా ప్రయాణించే వారెవరైనా ఇదేమిటని ప్రశ్నిస్తే, వారిపై తిరగబడుతున్న సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ముఖ్యంగా పెద్ద మార్కెట్ సమీపంలో నిత్యం పట్టపగలు లోడింగ్, అన్ లోడింగ్ చేస్తుండడంతో, అటువైపు వెళ్లే ప్రయాణికులు నరకయాతన పడుతున్నారు. ఇక దేవాలయం వీధిలో పలు హోల్‌సేల్ కిరణా దుకాణాలున్నాయి. వాస్తవానికి వీరు రాత్రి పది గంటల నుంచి ఉదయం 8లోపు లోడింగ్, అన్ లోడింగ్ చేయాలి. కానీ లారీ యజమానులు లోడ్ దిగకుండా, లారీ కిరాయి ఎక్కువగా చెల్లించాలని డిమాండ్ చేయడం, కొందరు వ్యాపారుల వద్ద స్టాకు అయిపోవడం వంటి కారణాలతో ఉదయం నుంచి సాయంత్రం వరకూ లోడింగ్, అన్ లోడింగ్ కార్యకలాపాలు కొనసాగిస్తూనే ఉన్నారు.



పెద్ద మార్కెట్‌లో మధ్యాహ్న సమయంలో ఇదీ పరిస్థితి



రామారావుపేటలో సాయంత్రం వేళ సిమెంట్ అన్ లోడింగ్ చేస్తున్న భారీ వాహనం

మామూలు సమయాల్లోనే..

కాకినాడ పెద మార్కెట్ సెంటర్‌లో కేవలం ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేందుకు ప్రజలు నిత్యం సాహసం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. అటువంటిది రోడ్డు మధ్యలో వాహనం నిలిపి, లోడింగ్ అన్ లోడింగ్ చేస్తుండడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా మారింది. నిత్యం ఇలా జరుగుతున్నా అక్కడున్న ట్రాఫిక్ సిబ్బంది చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. భారీ వాహనం లోనికి వస్తే కొందరు పోలీసులకు పంట పండినట్టే. వాహనాలు ఆపకుండా ఉన్నందుకు వాహన డ్రైవర్‌తో పాటు, షాపు యజమాని కూడా పోలీసుల చేతులు తడపడంతో, ఈ సమస్యకు అంతేలేకుండా పోతోంది.

గంటల తరబడి..

భారీ వాహనాల్లో బియ్యం, కిరణా సామాన్లు, కూరగాయలు వంటి వాటిని లోడింగ్, అన్ లోడింగ్ చేయడానికి గంటల తరబడి సమయం పడుతుంది. ఆయా భారీ వాహనాలు వ్యాపార సముదాయాల వద్ద నిలిపి లోడింగ్ చేస్తుండడంతో, సుమారు రెండు గంటల పాటు అక్కడ ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ఆ సమయంలో అటుగా ప్రయాణించే వారు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. దీనికితోడు రెండు భారీ వాహనాలు ఒకేసారి ఇటువైపు వస్తే మాత్రం, ఆ ఇరుకు రోడ్డులో ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. భారీ వాహనాలు అటూ ఇటూ కదలకపోవడంతో ట్రాఫిక్ సమస్య రెండింతలవుతోంది. దీంతో ప్రయాణికులు గత్యంతరం లేక వేరే మార్గాన్ని ఆశ్రయించాల్సి వస్తోంది.

సిమెంట్ లారీల స్వైరవిహారం

నగరంలో భవన నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో కొందరు బిల్డర్లు పోలీసులకు ఆమ్యామ్యాలు సమర్పించి, వేళాపాళా లేకుండా వారి భవనాల నిర్మాణం కోసం సిమెంట్, ఇసుక, ఇనుము వంటి మెటీరియల్‌ను అన్ లోడింగ్ చేస్తున్నారు. దీనికోసం రోడ్డు పక్కనే భారీ వాహనాలు ఆపడంతో ప్రమాదాలు సైతం జరుగుతున్నాయి.

భారీ జరిమానా విధిస్తాం



నిబంధనలు అతిక్రమించి కాకినాడ నగరంలో భారీ వాహనాలు వస్తే భారీ జరిమానా విధిస్తున్నాం. వాహనాలు రాకుండా ఉండేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకొంటున్నాం.

– నూనె రమేష్, ట్రాఫిక్ వన్ సీఐ